GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

T MEDIA

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : శనివారం-జనవరి 13-2024 పేజీలు : 3



## అటల్ సేతు' సముద్ర వంతెనను ప్రారంభించిన మోడీ

**టీ మీడియా, జనవరి 12, ముంబై:**

దేశంలోనే అతిపెద్ద సముద్ర వంతెన 'అటల్ బిహారి వాజ్‌పేయి సెవ్రి- న్వశేవ అటల్ సేతు'ను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శుక్రవారంనాడు ప్రారంభించారు. పట్టణ రవాణా మౌలిక సదుపాయాలు, అనుసంధానాన్ని పటిష్టం చేసి ప్రజలకు రాకపోకల సౌకర్యాన్ని సులభతరం చేయాలనే ప్రధాని విజన్‌లో భాగంగా ఈ వంతెన నిర్మాణం జరిగింది. 2016 డిసెంబర్‌లో ఈ బ్రిడ్జికి మోడీ శంకుస్థాపన చేశారు. రూ.17,840 కోట్ల వ్యయంతో నిర్మించిన 21.8 కిలోమీటర్ల సిక్స్ లేన్ బ్రిడ్జి ఇది. రాష్ట్రంలో రూ.30,500 కోట్లకు పైగా విలువైన పలు ప్రాజెక్టులను ప్రారంభించేందుకు ప్రధాని మహారాష్ట్రలో పర్యటిస్తున్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా నాసిక్‌లోని తపోవన్ గ్రౌండ్‌లో జరిగిన రాష్ట్రీయ యువ మహోత్సవ్‌ను ప్రధాని మోడీ ఈ సందర్భంగా ప్రారంభించారు. అటల్ సేతు ప్రత్యేకతలు1. దేశంలోనే 21 కిలోమీటర్ల మేర నిర్మించిన ఇతి పెద్ద సముద్ర వంతెన. 2.అటల్ సేతు నిర్మాణంతో ఈ వంతెన ద్వారా ముంబై నుండి నవీ ముంబై చేరుకోవడానికి కేవలం 20 నిమిషాలు పడుతుంది. 3.ఈ వంతెన దక్షిణ ముంబైలోని సెవ్రి నుండి ప్రారంభమై ఎలిఫెట్ ఐలాండ్‌కు ఉత్తరాన థానే క్రీక్‌ను దాటి న్వావా సమీపంలోని చిర్లే గ్రామంలో ముగుస్తుంది4. ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం, నవీ ముంబై అంతర్జాతీయ విమానాల మధ్య వేగవంతమైన కనెక్టివిటీ ఉంటుంది. పుణే, గోవా, దక్షిమ భారతదేశానికి కూడా తక్కువ సమయంలో ప్రయాణించవచ్చు. 5.ముంబై ట్రాన్స్ హార్బర్ లింగ్ ద్వారా నాలుగు చక్రాల వాహనాలు గంటకు 100 కిలోమీటర్ల వేగంగా ప్రయాణించే వీలుంది. మోటార్ బైక్‌లు, ఆటో రిక్షాలు, ట్రాక్టర్లు ఈ బ్రిడ్జిపై అనుమతించరు. 6.ప్రాజెక్టు కారణంగా ఆవాసం కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం పరిహారం అందిస్తోంది.

# మళ్లీ వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థ

- అధికారికంగా ప్రకటించే అవకాశాలు

## మరింత పటిష్టంగా రెవెన్యూ శాఖ



**టీ మీడియా, జనవరి 12, హైదరాబాద్ :**

రాష్ట్రంలోని రెవెన్యూ ఉద్యోగులు, అధికారులకు శుభవార్త. రాష్ట్ర ప్రభుత్వానికి, గ్రామాలకు మధ్య వారధిగా పనిచేస్తూ వచ్చిన గ్రామ రెవెన్యూ వ్యవస్థ మళ్లీ పునరుద్ధరించేందుకు, విఆర్వో,-వి ఆర్ఏ వ్యవస్థలకు మళ్లీ జీవం పోసేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ కసరత్తులు చేస్తోంది.గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను గతంలో కంటే మరింత పటిష్టంగా తయారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ రెవె న్యూ మంత్రిత్వశాఖ నిర్ణయం తీసుకొంది. ఈ మేరకు రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో గ్రామ రెవెన్యూ వ్యవస్థలో పునరుద్ధరణకు సం బంధించిన బిల్లును ప్రవేశపెట్టే అవకాశాలున్నాయని, ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గానీ, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిగానీ అధికారికంగా ప్రకటించే అవకాశాలున్నాయని కొందరు సీనియర్ అధికారులు వివరించారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి స్థాయిలో విధానపరమైన నిర్ణయం తీసుకొన్న తర్వాత రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణ కార్యక్రమాలు మొ దలవుతాయని, అయితే గ్రామాల్లో తిష్ఠవేసిన ఎన్నో సమస్యలను ప్రభుత్వం గుర్తించిందని, దాదాపు 20రకాల సమస్యలు, విఆర్వో, నిర్వర్తించే డ్యూటీలు, బాధ్యతలు అన్నీ పెండింగ్ సమస్యలుగా మిగిలిపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే విషయాలను ఉన్నతాధికారులే కాకుం డా రెవెన్యూ శాఖ మంత్రి, చివరకు ముఖ్యమం త్రి కూడా గుర్తించారని, అదీగాక ఎన్నికల సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి ఎన్నో సమస్యలు వచ్చాయని, వాటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణ జరిగి తీరాలని సిఎం చాలా స్పష్టంగా ఆదేశించారని ఆ అధికారులు వివరించారు.అయితే మొన్నటి వరకూ మనుగడలో ఉన్న విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ (విఆర్వో), విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ (విఆర్ఏ) పోస్టులను యథావిధిగా ప్రవేశపెడతారా? లేక ఆ రెండు రకాల పోస్టులను కలిపి ఒకే పో స్టుగా సర్దుబాటు చేసి విలేజ్ రెవెన్యూ సెక్రటరీ (విఆర్ఎస్) అనే పోస్టును సృష్టించి నియామకాలు చేస్తారా? అనే అంశాలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, ముఖ్యమంత్రి స్థాయిలో సమీక్ష జరిగిన తర్వాత విధానపరమైన ఆదేశాలు వచ్చి న తర్వాత తుది నిర్ణయం తీసుకొంటామని ఆ అధికారులు వివరించారు. అంతేగాక ఇప్పటికే విఆర్వో డిజిగ్నేషన్‌తో పనిచేసిన 5,500 మంది ఉద్యోగులను ఇతర ప్రభుత్వ శాఖలకు బదిలీ చేశారని, అంతేగాక సుమారు 22,500 మంది విఆర్ఏలను కూడా ఇతర విభాగాలకు బదిలీ చేశారని, ఇందులో మెజారిటీ ఉద్యోగులను జూనియర్ అసిస్టెంట్‌లుగా చేసి రెగ్యులర్ జీతం స్కేలు ఇస్తున్నారని, వారందర్నీ వెనక్కు పిలుస్తారా? లేక ఆప్షన్ అడిగిన తర్వాతనే వారి ఇష్టానుసారంగా పాత పోస్టులో నియమిస్తారా? అనే అంశాలపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే విషయంపై ప్రభుత్వంలో చర్చలు జరుగుతున్నాయని వివరించారు.సాధ్యమైనంత తొందరగా గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించడమే కాకుండా ఆ వ్యవస్థను మరింతగా బలోపేతం చేయడమే కాకుండా ప్రభుత్వానికి రెండు కళ్ళుగా గ్రామాల్లోని రెవెన్యూ ఉద్యోగులు విధులు నిర్వర్తించే విధంగా చేస్తామని, అందుకు తగినట్లుగా ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు. లేకుంటే గ్రామాల్లో 20 రకాల డ్యూటీలన్నీ పడకేశాయని, అంతేగాక గ్రామాలకు మంతులు వచ్చినా, చివరకు కలెక్టర్ వచ్చినా ప్రోటోకాల్ విధులు నిర్వర్తించేవారు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామనే అంశాన్ని ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. గ్రామాల్లో భూముల సమస్యల పరిష్కారాలు, శాంతి-భద్రతల సమస్యలు, ప్రకృతి వైపరీత్యాలు, ధాన్యం కొనుగోళ్లు సంక్షేమ పథకాల చెక్కుల పంపిణీ, సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసే కార్యక్రమాలు, ఎలక్షన్ డ్యూటీలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఇన్‌కం సర్టిఫికెట్లు, బర్త్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్లు, ఇసుక మాఫియా ఆగడాలు, మట్టి తవ్వకాలను అరికట్టడం, యాక్సిడెంట్లుగా జరిగినా ఇప్పుడు పక్కా సమాచారం ఇచ్చే నాధుడు లేడని, వ్యవసాయ ఆదాయ పత్రాలు జారీ చేయడం, ఓటర్ల జాబితా తయారీ, సివిల్ సప్లయిస్ డ్యూటీలు, రేషన్ షాపుల సమాచారం, ప్రకృతి వైపరీత్యాలు, కరువు, కాటకాలు, పంటల నష్టాల అంచనాలు వేసేటప్పుడు కీలకమైన పాత్రను పోషించాల్సిన ఉద్యోగులు ఇప్పుడు గ్రామాల్లో ఎవ్వరూలేరని, ఆ బాధ్యతలన్నింటినీ నిర్వర్తించే విఆర్వో, విఆర్ఎలు లేకపోవడం మూలంగా అవన్నీ పెండింగ్ సమస్యల జాబితాలోకి చేరిపోయాయనే అంశాలను ఈ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గుర్తించిందని, అందుకే మళ్లీ గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకొన్నట్లుగా వివరించారు.కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయడం దగ్గర్నుంచి వారికి చెక్కులను పంపిణీ చేసే వరకూ సంబంధిత గ్రామాల్లో ప్రజలతో కలిసిపోయి ప్రభుత్వానికి, తహసీల్దార్ల దగ్గర్నుంచి ఆర్‌డిఒ, కలెక్టర్ల వరకూ మార్గదర్శకులుగా బాధ్యతలు నిర్వర్తించేదే విఆర్వో, విఆర్ఎలని, అలాంటి ఉద్యోగులు లేకపోతే ప్రభుత్వానికి, గ్రామాలకు మధ్య లింకు తెగిపోయినట్లేనని, అందుచేతనే ఆ వ్యవస్థను పునరుద్ధరించకపోతే ప్రజలకు-ప్రభుత్వానికి మధ్య గ్యాప్ కూడా పెరిగిపోతుందనే అంశాలను ప్రభుత్వ పెద్దలు గుర్తించారని వివరించారు. ఇలా సమాజంలో అత్యంత కీలకమైన పాత్రను పోషించే రెవెన్యూ ఉద్యోగులు లేకపోతే ఎన్ని అనర్థాలు జరుగుతాయనడానికి గత మూడేళ్లల్లో గ్రామాల్లో పేరుకుపోయిన లక్షలాది సమస్యలే ప్రత్యక్ష సాక్షమని ఆ అధికారులు వివరించారు. అందుకే ప్రజలకు అత్యంత చేరుగా ఉంటూ, ప్రజలకు చేదోడు, వాదోడుగా, ప్రజలకు ప్రభుత్వమే తమ కళ్లముందు ఉంది అన్నట్లుగా విధులు నిర్వర్తించే గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించడమే న్యాయమైన చర్యని తమ ప్రభుత్వం భావిస్తోందని వివరించారు. అందుకే యుద్ధప్రాతిపదికన గ్రామ రెవెన్యూ వ్యవస్థ మరింత పటిష్టంగా సేవలందించేందుకు రాబోతోందని వివరించారు.




## ఎస్ఆర్ యూనివర్సిటీలో ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య

**టీ మీడియా , జనవరి 12, హన్మకొండ :**

ఈనెల 6వ తేదీ సంగారెడ్డి గీతం యూనివర్సిటీలో బీటెక్‌లో చేరిన మూడు నెలలకే రేణుశ్రీ అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంగతి విదితమే. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఘటన సంచలనాన్ని రేపింది. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరలయ్యింది. అయితే తాజాగా.. మరో విద్యార్థిని సూసైడ్ ఘటన వెలుగుచూసింది. హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం అన్నసాగర్ ఎస్ఆర్ యూనివర్సిటీలో రాథోడ్ దీప్తి అనే విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీప్తి యూనివర్సిటీలో అగ్రికల్చర్ చదువుకుంటుంది. సంక్రాంతి సెలవులు కావడంతో అందరూ ఇళ్లకు వెళ్లే హడావిడిలో ఉన్నారు. ఇంతలో తమ స్నేహితురాలు తన గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోవడం చూసి స్నేహితులంతా షాకయ్యారు. వెంటనే యూనివర్సిటీ అధికారులకు సమాచారమిచ్చారు. అక్కడకు చేరుకున్న యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని ఎంజిఎం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లోంచి దర్యాప్తు చేపట్టారు.

## ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

- ప్రధాని మోడీ



**టీ మీడియా, జనవరి 12, ముంబై :**

ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. మహారాష్ట్రలోని ముంబయి నగరంలో నిర్మించిన దేశంలో అత్యంత పొడవైన సముద్రపు వంతెన ముంబయి ట్రాన్స్ హార్బర్ లింక్ ను భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారు. ముంబయిలోని సేవ్రీ నుంచి రాయగఢ్ జిల్లాలోని సహవా శేవాను కలుపుతూ 17వేల 840 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఆరు లైన్లుగా నిర్మించారు. ఇక, 2016 డిసెంబర్ నెలలో ప్రధాని మోడీ ఈ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి గౌరవార్థం ఈ బ్రిడ్జ్ కు అటల్ సేతు అని నామకరణం చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాసిక్ కాలారామ్ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రధాని మోడీ మాట్లాడుతూ.. ఇవాళ నాసిక్ రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.. అయోధ్య ప్రాణ ప్రతిష్ట వేళ నాసిక్ లో ప్రత్యేక కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. పంచవటి ప్రాంతంలో సీతారాములు చాలా కాలం ఉన్నారన్నారు.. అన్ని ఆలయాల్లో పరిశుభ్రత క్యాంపైన్ ను మొదలి పెట్టాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారన్నారు. టెక్నాలజీ రంగంలో భారత్ వృద్ధి సాధిస్తుందని చెప్పుకొచ్చారు.



## కేంద్రానికి సుప్రీం నోటీసులు

**టీ మీడియా , జనవరి 12,న్యూఢిల్లీ :**

భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని అత్యున్నత కమిటీ నియమించే ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఈసి), ఎలక్షన్ కమిషర్(ఈసి)ల నియామకంపై సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్రానికి నోటీసులిచ్చింది. ఏప్రిల్‌లోగా సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో కేంద్రాన్ని ఆదేశించింది. సిఈసి, ఈసి నియామకం, వారి విధులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన చట్టంపై స్టే విధించేందుకు నిరాకరించింది. అయితే ఈ చట్టాన్ని కొట్టేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను విచారించేందుకు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా నేతృత్వంలోని ధర్మాసనం అంగీకరించింది. ఈ చట్టాన్ని తాము ఎలా నిలువరించగలం అని ధర్మాసనం పిటిషనర్ తరుపు న్యాయవాది డా. జయ ఠాకూర్‌ని ప్రశ్నించింది. ఈ కేసుపై ఏప్రిల్‌లో విచారణకు జాబితా చేసేందుకు అంగీకరించింది.

# విజయవాడలో 125 అడుగుల అంబేద్కర్

- 19న సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభం..





**టీ మీడియా, జనవరి 12, విజయవాడ:**

నగరంలో పీబ్ల్యూడి గ్రౌండ్ 400 కోట్ల రూపాయలతో నిర్మించిన డా.బీఆర్ అంబేద్కర్ స్మారక స్మృతివనం అతి త్వరలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరగనుంది. ఇప్పటికే అంబేద్కర్ స్మృతి వనం పనులు పూర్తి అవ్వగా ప్రారంభోత్సవానికి శరవేగంగా పనులు పూర్తి చేస్తున్నారు.ప్రపంచ దేశాలు గర్వించదగ్గ మహా మనిషి, భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహా విష్కరణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వేదికగా మారింది. హిందువుల పెద్ద పండగ సంక్రాంతి సంబరాలకు కొనసాగింపుగా జనవరి 19వ తేదీన విజయవాడ నగరంలోని బీడబ్ల్యూడి గ్రౌండ్లో ఏర్పాటు చేసిన 125 అడుగుల భారీ విగ్రహా ఆవిష్కరణ చేయనున్నారు.బలుగు, బలహీన వర్గాలకు అండగా, ఆశజ్యోతిల వెలిగిన, బీసీ, ఎస్టీ, ఎస్సీ సహా ఇతర వర్గాల ప్రజల సమాన హక్కుల కోసం పోరాడి, భారత రాజ్యాంగాన్ని లిఖించడంలో డా. బీఆర్. అంబేద్కర్ ప్రధాన పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో ఆయన విగ్రహా అవిష్కరణ రోజును రాష్ట్ర పండుగగా జరుపుకోవాలని బీసీ రాష్ట్ర అధ్యక్షుడు మారేష్ పిలునిచ్చారు. బీసీ, ఎస్టీ, ఎస్సీ .. ఇతర వర్గాల ప్రజల తరపున ఉత్తరాంధ్ర రాష్ట్రంలో బీసీ, ఎస్టీ, ఎస్సీ మరియు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలె విగ్రహా ఏర్పాటు చేయాలనీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి కోరినట్లు తెలిపారు.

రాష్ట్రంలో అతి పెద్ద విగ్రహా ఆవిష్కరణ ఇప్పటి వరకు ఏ రాజకీయ నాయకుడు కూడా చేయలేదు. మనసున్న ముఖ్యమంత్రి.ఎస్టీ, ఎస్సీ మరియు బలహీన వర్గాల ప్రియతమ నేత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి 125 అడుగుల డా. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయటం చాలా సంతోషంగా ఉందని బీసీ రాష్ట్ర సెల్ సభ్యుడు .. బెజవాడ రూరల్ అధ్యక్షుడు బెజవాడ గణేష్ అన్నారు.



## కక్షతో అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్

మాజీ మంత్రి హరీష్ రావు

**టీ మీడియా, జనవరి 12, మెదక్ :**

ఇప్పుడొచ్చిన ప్రభుత్వం కొత్త మండలాలను, జిల్లాలను రద్దు చేస్తుందట. కొత్త విద్యుత్ పాలసీ తెస్తామని కాంగ్రెస్ అంటున్నది. కొత్త పాలసీ అంటే పాత కాంగ్రెస్ కరెంటు తెస్తారా? అని ప్రశ్నించారు మాజీ మంత్రి , బిఆర్ఎస్ నేత హరీష్ రావు.. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని జీడిపల్లిలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక కాంగ్రెస్ నేతల తీరును ఎండగడుతూ, కేసీఆర్ రైతులకు ఇచ్చిన 24 గంటల కరెంట్ పై అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని కక్షతో అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ఢిల్లీలో కొట్లాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమే అని తేల్చి చెప్పారు.

## 420 హామీలు చేసేంతవరకు కాంగ్రెస్‌ను వెంటబడి తరుముతాం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**టీ మీడియా, జనవరి 12, హైదరాబాద్ :**

పదేళ్లో తాము చేసిన అభివృద్ధి కనిపిస్తుంటే%ా% కళ్ళు లేని కబోదిలా కాంగ్రెస్ పార్టీ వ్యహరిస్తుందని మండిపడ్డారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఇప్పుడే ట్రైలర్ స్టార్ట్ అయిందని , ఫిబ్రవరి నుంచి అసలు సినిమా చూపిస్తామని కాంగ్రెస్ ను హెచ్చరించారు..తెలంగాణ భవన్ లో నేడు జరిగిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో నాయకులకు , కార్యకర్తలకు కేటీఆర్ దిశా నిర్దేశం చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఒక్కొ హామీకి తిలోదకాలు ఇస్తున్నదని మండిపడ్డారు.. అధినాయకుడు కేసీఆర్ ప్రజా క్షేత్రంలోకి రాగానే కాంగ్రెస్ పార్టీకి సినిమా స్టార్ట్ అవుతుందని అన్నారు

### 420 హామీలు కాంగ్రెస్ అమలు చేయాల్సిందే :

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు అమలు చేసేంత వరకు ప్రజల తరుపున పోరాటం చెయ్యాలన్నారు.అయిదే ఏళ్ల పాటు హామీలు అమలు చేసే వరకూ కాంగ్రెస్ పార్టీని వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల పుస్తకంను బైబిల్, ఖురాన్, భగవద్గీత లాగ చదవి అవి అమలు చేసేంత వరకు వదలొద్దని తెలిపారు. తన రాజకీయ జీవితంలో ఒక్క నెలలోనే ప్రజల వ్యతిరేకతను ముటగట్టుకున్న ప్రభుత్వం ఒక్క కాంగ్రెస్ మాత్రమే అన్నారు. ఎన్నికల్లో ఎదురు దెబ్బలు, గెలుపులు సహజమన్నారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంను కాంగ్రెస్ పార్టీ కరపత్రంలా మాట్లాడించారని తెలిపారు. కేసీఆర్ పైన ఇష్టం వచ్చినట్లు దుష్ప్రచారం చేయించారని తెలిపారు. సెక్రటేరియట్ మీడియా పాయింట్ లో మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్ రావు మాట్లాడుతున్నారని అన్నారు.



# నియంత పోకడలే అధికారం కోల్పోవడానికి కారణం

● ప్రొఫెసర్ కోదండరామ్

**టీ మీడియా, జనవరి 12,హైదరాబాద్:**

బిఆర్ఎస్ పాలనలో ఆంక్షలు, భయం చూశామని.. ఇప్పుడు తల మీద భారం తగ్గినట్లు అనిపిస్తోందని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ఇప్పుడు స్వేచ్ఛగా ఫోన్లు మాట్లాడుకోగలుగుతున్నామన్నారు. కాంగ్రెస్ నెల రోజుల పాలన బాగుందన్నారు. నాలుగో తేదీలోగా జీతాలు వస్తున్నాయని ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు."ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలతో కలిసిపోయి పని చేస్తున్నారు. ఢిల్లీలో కూడా మార్పు రావాలని కోరుకుంటున్నాం. తెలంగాణ ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలని కోరాం. గత ప్రభుత్వం నిరసన వ్యక్తం చేసినవారిపై కేసులు పెట్టింది. రాజకీయ ఉద్దేశంతో పెట్టిన కేసులు ఎత్తి వేయాలి.



నియంతఅత్వాన్ని ఓడించాలని పోరాటం చేశాం. ప్రజలకు అవగాహన కల్పించేందుకు అనేక సదస్సులు, సమావేశాలు నిర్వహించాం. ఎట్టకేలకు నియంతఅత్వ ప్రభుత్వాన్ని గద్దె దించడంలో విజయం సాధించాం. నియంత పోకడలే అధికారం కోల్పోవడానికి కారణమని ఇప్పటికీ బిఆర్ఎస్ నేతలు గుర్తించలేకపోతున్నారు.తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను మోడీ తప్పుబట్టారు. ప్రధాని వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. బయ్యారం ఉక్కు పరిశ్రమ మీద ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఎన్నికలను దఅష్టిలో పెట్టుకొని కాజీపేట రైల్వే వ్యాగన్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారు. విభజన హామీలు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తోంది. భద్రాచలం రాములవారి ఆలయానికి భద్రత లేకుండా పోయింది. తెలంగాణపై కేంద్రం చూపిస్తోన్న వివక్షను తెలియజేసేందుకు రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్ర ప్రజల పరిరక్షణ కోసం మేం ఎప్పటికీ నిలబడి ఉంటాం. ఈ నెల 21న ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో సదస్సు నిర్వహిస్తాం" అని తెలిపారు

## వివేకానందుని ఆశయాలు యావత్ ప్రపంచానికి ఆదర్శం

● ఎమ్మెల్యే విజయరమణ రావు

**టీ మీడియా, జనవరి 12, పెద్దపల్లి :**



పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ప్రపంచ మేధావి వివేకానందుని 162 వ జయంతిని పురస్కరించుకొని మీ నేస్తం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సామల రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణంలోని వివేకానందుని విగ్రహానికి ఎమ్మెల్యే విజయ రమణారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వీట్లు పంపిణీ చేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ యువతకు మార్గదర్శకుడు, భారత దేశ సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి వివేకానందుడినీ నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. యువతకు స్ఫూర్తిదాయకుడు వివేకానందుని బోధనలు యువత ఆచరిస్తూ సన్మార్గంలో నడుచుకోవాలని అన్నారు. వివేకానందుని బోధనలకు సంబంధించిన పుస్తకములను విద్యార్థినిలు అందజేశారు. అనంతరం సామల రాజేంద్రప్రసాద్ తో పాటు శివాలయం అర్చకులు వడ్లకొండ మహేష్, వడ్లకొండ రమేష్ లు విజయ రమణారావు ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మీ నేస్తం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సామల రాజేంద్రప్రసాద్, సీనియర్ జర్నలిస్టు సామల హరికృష్ణ, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బిరుదు సమత కృష్ణ, మాజీ సర్పంచ్ అంతటి అన్నయ్య గౌడ్, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, శ్రీవాణి విద్యాసంస్థలు చైర్మన్ రేకులపల్లి శశాంక్, కాంగ్రెస్ నాయకులు దన్నాయక్, దామోదర్ రావు, దున్నపోతుల రాజయ్య, చింతల రాజు, చిలుక సతీష్, వేగోళం అబ్బయ్య గౌడ్, కల్లెపల్లి జానీ, పెందోట వెంకటేశ్వర్లు, దూడం లింగమూర్తి, జూపాక కుమారస్వామి, దూడం ఆంజనేయులు, శ్రీవాణి కళాశాల ప్రిన్సిపాల్ బండారి కమలాకర్, బండారి ఆంజనేయులు, శ్రీవాణి కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి , షాదీముబారక్ చెక్కులను పంపిణి చేసిన ఎమ్మెల్యే

**టీ మీడియా, జనవరి 12, పెద్దపల్లి :**



పెద్దపెల్లి జిల్ల ఓదెల మండలంలోని మారుతీ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయ రమణ రావు పాల్గొని వివిధ గ్రామాలకు చెందిన 41 మంది లబ్ధిదారులకు ?41,04,756/- ( నలభైఒక లక్షల నాలుగు వేల ఏడువందల యాభైఆరు రూపాయల) కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం అందించే, ఆరు గ్యారంటీ పథకాలు, అందరికీ అందేలా కృషి చేస్తానని, నా గెలుపుకు కృషి చేసిన, ప్రజలందరికీ, ఎల్లవేళలా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓదెల మండల ఎమ్మార్వో, ఎంపీడీఓ ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ నాయకులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, ఎంపీపీ, సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు, లబ్దిదారులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ఇండో అమెరికన్ స్కూల్లో టీ మీడియా క్యాలెండర్ ఆవిష్కరణ

**టీ మీడియా, జనవరి 12, రామగుండం:**



పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఇండో అమెరికన్ స్కూల్లో శుక్రవారం స్కూల్ డైరెక్టర్ హేమలత, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీ మీడియా 2024 క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో క్రైమ్ రిపోర్టర్ వినయ్,స్కూల్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## ట్రినిటీ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

**టీ మీడియా, జనవరి 12, పెద్దపల్లి :**



పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని, స్థానిక ట్రినిటి ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరు సంప్రదాయ వస్త్రధారణలో పాఠశాలకు హాజరు అయ్యారు. పాఠశాలను పల్లెటూరి వాతావరణ%శీ% తలపించేలా అల%శీ%కరించడ%శీ%, హరిదాసులు, గంగిరెద్దుల వారి వేషధారణలో విద్యార్థులు అలరించారు. విద్యార్థులంతా గాలి పటాలు ఎగురవేసే కార్యక్రమ%శీ%లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ దాసరి మమతా రెడ్డి హాజరై చిన్నారులకు భోగి పళ్ళ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశిస్తున్న%శీ%దున మకర సంక్రమణ%శీ%, దీనినే మకర సంక్రాంతి పండుగగా జరుపుకుంటాం. అదే విధంగా పంటలు ఇంటికి వచ్చి ప్రతి ఇల్లు ధాన్యలక్ష్మితో కళకళలాడుతు%శీ%డటం వల్ల పిన్నపెద్దలందరు ఆనందోత్సాహాలతో ఈ పండుగను జరుపుకుంటారని తెలియజేశారు. ఇలాంటి పండుగలు జరుపుకోవడం వలన విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాల పట్ల అభిరుచి ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమ%శీ%లో ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి

**టీ మీడియా, జనవరి 12, గోదావరిఖని :**



స్వామి వివేకానంద 161జయంతిని పురస్కరించుకొని శుక్రవారం హిందు వాహిని రామగుండం కార్పొరేషన్ శాఖ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ లో కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా సంయోజక్ రాగం శ్రీధర్,రామగుండం బిజెపి అభ్యర్థి కందుల సంధ్యారాణి హిందు వాహిని ప్రాంత తెలంగాణ ప్రాంత సభ్యులు పైతరి రాజు,జిల్లా సహ సంయోజక్ దుస్స సాయి, సభ్యులు అరవింద్, సురేష్, మనీ, భరత్,సోను,రాజ్ కుమార్,నివాస్, ప్రణీత్,మనీ తదితరులు పాల్గొన్నారు.

## టీ మీడియా క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**టీ మీడియా, జనవరి 12, జన్నారం:**



మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ భవనంలో ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మా బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర టీ మీడియా క్యాలెండర్ ను ఆవిష్కరించారు.

## చెక్కులను పంపిణి ఎమ్మెల్యే విజన్న


**టి మీడియా, జనవరి 12, ఓదెల :**



పెద్దపెల్లి జిల్లా ఓదెల మండలంలోని మారుతీ ఫంక్షన్ హాల్ లో వివిధ గ్రామాలకు చెందిన 41 మంది లబ్ధిదారులకు ?41,04,756/- ( నలభైఒక లక్షల నాలుగు వేల ఏడువందల యాభైఆరు రూపాయల) కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు,ఈ కార్యక్రమంలో ఓదెల మండల, ఎంఆర్ఓ ప్రభుత్వ అధికారులు,కాంగ్రెస్ నాయకులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, ఎంపీపీ, సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు, లబ్దిదారులు, మహిళలు, మైనారిటీలు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించిన పాఠశాల యాజమాన్యం

**టీ మీడియా, జనవరి 12, రామకృష్ణాపూర్ :**



క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ పట్టణంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్లో శుక్రవారం సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు.ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ చాటిన బి.స్వర్ణలత, ఎం.ప్రశాంతి, సిహెచ్. రాజమణి అనే ముగ్గురు మహిళలు బహుమతులను కైవసం చేసుకున్నారు.ఇద్దరికి కన్సోలేషన్ బహుమతులు అందించారు. అలాగే పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ మెమెంటో అందచేశారు. పాఠశాల డైరెక్టర్ పొన్నాల వినయ్,ప్రిన్సిపాల్ పొన్నాల సుమన్,జిల్లా పర్యావరణ విద్య సమన్వయ అధికారి గుండేటి యోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.





## సంక్షేమం అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

● ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

**టీ మీడియా, జనవరి 12, మహానంది:**

ప్రజల సంక్షేమం అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. శుక్రవారం మహానంది మండలంలోని గాజులపల్లె, అబ్బిపురం, బుక్కాపురం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, డ్రైనేజి,సీసీ రోడ్లు, వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్,నీటి పైపు లైన్ లను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ప్రారంభించారు. ముందుగా వైసీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే శిల్పా ను ఘనంగా సన్మానించి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం మన ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి తోనే సాధ్యం అని,గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు.ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలతో పాటు, శాశ్వత అభివృద్ధి వైపు కూడా అడుగులు వేయడం జరిగిందని తెలిపారు. రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చారని, ప్రతి రైతుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించడానికి రైతు భరోసా కేంద్రాలు ఉపయోగపడ తాయన్నారు.రాష్ట్రమంలో ముఖ్య మంత్రి వైయస్ జగన్ మెహన్ రెడ్డి ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు అండగా ఉంటూ భరోసా కల్పిస్తున్నాయని, జగనన్న పాలనలో రైతులకు అన్ని రకాల అభివృద్ధి జరిగిందన్నారు. జగనన్న ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శిల్పా కోరారు.ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజా రోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, గ్రామానికి ఒక హెల్త్ క్లినిక్ ను ఏర్పాటు చేసి, గ్రామస్థాయిలోనే మెరుగైన వైద్యం ప్రజలకు అందించేందుకు కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తున్నారన్నారు. వైయస్సార్ హెల్త్ క్లినిక్ ను ప్రతి ఒక్కరు వినియోగించుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని, జెడ్పిటిసి మహేశ్వర్ రెడ్డి,ఎంపిడిఓ శివ నాగజ్యోతి, మహానంది ట్రస్టు బోర్డు చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, వైసిపి నాయకులు కొండా మధుసూదన్ రెడ్డి,వడుగూరి రామకృష్ణుడు, పక్కీరయ్య , పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాభవన్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

**టీ మీడియా , జనవరి 12,హైదరాబాద్:**



తెలంగాణాలోని వివిధ జిల్లాలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం ప్రజాభవన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఇక్కడ నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. అధికారులు వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అదే సమయంలో మధ్యాహ్న భోజన కార్మికులు అక్కడే నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ప్రతి నెల పదో తేదీ లోపే మెస్ బిల్లులు, వేతనాల చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తమకు రూ. 3వేల వేతనం పెంచారని%ూ% దీనిని వెంటనే అమలు చేయాలన్నారు. మరోవైపు జీవో 46ను వెంటనే రద్దు చేయాలని నిరుద్యోగులు ప్రజాభవన్ వద్ద నిరసన తెలిపారు. రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకున్నారు.



## ఘనంగా కళ్యాణ ఉత్సవం, కుడారై వేడుకలు

**టీ మీడియా, జనవరి 12, పెద్దపల్లి :**

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ధనుర్మాసం ఉత్సవాలలో భాగంగా స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం గోదా రంగనాయకుల స్వామి వారి కళ్యాణాన్ని ఘనంగా మరి కూడారై వేడుకను కూడా నిర్వహించారు.ధనుర్మాసం 30 రోజులలో తిరుప్పావై పాశురాలను భక్తులందరూ కలిసి స్వామివారికి నివేదించడం జరుగుతుంది అని అందులో భాగంగా 27వ రోజు విశేషమైన పాశురం, కూడరై వెళ్లుం శీర్ గోవిందా... అనే పాశురం ప్రాధాన్యత ను అనుసరించి మహిళలు శ్రీ వ్రతములు సిరి నోములు ఆచరిస్తున్నారు. అని ఇందులోభాగంగా స్వామి వారికి పాలు అన్నం.. వాటిలో నిండా మునిగే విదంగా నెయ్యి వేసి తయారు చేసిన పాయసం నాయి నైవేద్యాన్ని ఒక్కక్కరూ ఇత్తడి గంగాళాలు పాత్రలో నింపి స్వామికి సమర్పించారు. పూజల అనంతరం వాటిని సాదుల సునీత సుగుణాకర్ దంపతలు కలసి వాటిని భక్తులకు వాయనంగా ఇచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నోములు నోచుకున్న మహిళలు ఈరోజు ఉపవాస దీక్షలో ఉంటారు. కూడారయి ఉత్సవం గురించి అర్చకులు సౌమిత్రి వేణుమాధవ్ ఆచార్యులు. శ్రావణ్ కుమారచార్యులు భక్తులకు వివరించారు. వారిచే నోములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబాయ్ నోములు భాగంగా నెల రోజుల పాటు పాశురాలు అనుసంధానం చేయడం ఆనవాయితీ. ఇందులో బాగంగా గోదామ్మ స్వామిని వివాహం చేసుకోవాలని లక్ష్యంగా ఈ పాశురాలు ఉంటాయి. శుక్రవారం 27 వ పాశురం రోజునే గోదా రంగ నాయకుల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కళ్యాణ తంతును పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు ప్రారంభించారు. ఆయనకు ఆలయం లో పూర్ణకుంభము తో స్వాగతం పలికి సన్మానం ఆశీర్వచనం చేశారు..ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పల్లా మురళి సదా లక్ష్మి, వికాశతరంగిని భాద్యులు, వేంకటేశ్వర శరణా గతి దీక్షా నిర్వాహకులు, జర్నలిస్టుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, మున్నూరు కాపు జర్నలిస్ట్ ఫోరం జిల్లా అధ్యక్షుడు సాదుల సుగుణాకర్ సునీత దంపతుల తో పాటు ఎంపీపీ బాలాజీ రావు స్వరూప ప్రధానార్చకులు సౌమిత్రి వేణు మాధవా చార్యులు వీణా, శ్రావణ్ కుమార్ హరిణి, ప్రసాదాచర్యులు తదితరుల తో పాటు పెద్ద ఎత్తున భక్తులు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద జయంతి

**టీ మీడియా, జనవరి 12, ఖమ్మం**



స్వామి వివేకానంద జయంతిని జిల్లా సీనియర్ సిటిజన్స్, ఇండియన్ రెడ్ క్రాస్ ఖమ్మం బ్రాంచ్ వారు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానకి డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పలు సందేశాలు యువతరంకు ఇచ్చారు. వివేకానంద దేశానికి ఆదర్శం అన్నారు. వివేకానందుడు ఏకసంథాగ్రహి భగవద్గీతను పూర్తిగా అధ్యయనం చేసి అమలు చేసిన మహానుభావుడన్నారు. ఆశయం లేని వాడు అసలైన పేదవాడు అని వివేకానందుడు చెప్పాడన్నారు. నిరాశ, నిస్పృహ, భయభ్రాంతిలో ఉన్నప్పుడు యువతకు వివేకానందుడి ఆదర్శమన్నారు. ఆయన రచించిన పుస్తకాలు చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ భాస్కర రావు, ఎంసీ సభ్యుడు జిల్లా లక్ష్మీనారాయణ, సంఘ ఉపాధ్యక్షులు కెదాసు నరసయ్య, శ్రీహరి, కార్యదర్శి అనాసి రాధాకృష్ణ, క్యాన్సిలేషన్ అధికారి జల్లా వెంకటేశ్వర్లు, కుటుంబరావు, జయతి, జనార్ధన్, కృష్ణయ్య, పుల్లయ్య, గుప్తా, చిన్న హుస్సేన్, అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు.

## 96 గ్రాముల గంజాయి పట్టివేత

**టీ మీడియా, జనవరి 12, జన్నారం:**



మండలంలోని ఇంధన్ పల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా గంజాయి అమ్మడానికి ప్రయత్నించగా పట్టుకున్నట్లు జన్నారం ఎస్సై సతీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలంలోని ఇందనపెల్లి గ్రామానికి చెందిన గడ్డం పవన్ కళ్యాణ్ అనే వ్యక్తి గంజాయిని అమ్ముతు, అదే గ్రామానికి చెందిన కాల్వ శివాజీ అనే వ్యక్తి తో ఉన్న పాత గొడవలను మనసులో పెట్టుకొని అతని వద్ద వున్న గంజాయి లో కొంత గంజాయిని శివాజీ బండిలో పెట్టి అతనినీ గంజాయి కేసు లొ ఇరికించాలని ప్లాన్ చేసి, మిగిలిన గంజాయిని ఎవరికైనా అమ్ముదామని వెళు తుండగా గురువారం రోజున సాయంత్రం జన్నారం మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద జన్నారం అదనపు ఎస్సై సర్కార్ వాహనాలు తనకి నిర్వహిస్తుండగా, వారిని చూసి పారిపోవడానికి ప్రయత్నించగ పోలీస్ సిబ్బంది నిందితుడిని పట్టుకొని 96 గ్రాములు గంజాయి (విలువ 2500 రుపాయలు), ఒక బజాజ్ డిస్కవరీ ద్విచక్ర వాహనం, మొబైల్ స్వాధీన పరచుకున్నారు. ఇట్టి గంజాయి కవ్వాల్ గ్రామానికి చెందిన రాహుల్ అనే వ్యక్తి దగ్గర కొన్నాను అని తెలుపగా పవన్ కళ్యాణ్, రాహూల్ పై క్రైమ్ నెంబర్ 08/ 2024 యూ /%ంవష 8(ఎ%) ఆర్ /డబ్ల్యూ 22 (%ఎ) (ఊఱ%) ఏ అఫ్ ఎన్డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై సతీష్ మాట్లాడుతూ.. అక్రమ గంజాయి రవాణా చేసిన నిలువ ఉంచిన సేవించిన గాని చట్టరీత కఠిన చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు. ఎవరైనా గంజాయి క్రయవిక్రయాల, సేవించే వారి వివరాలు తెలిపినచో వారి వివరాలను గోప్యంగా ఉంచబడునని తెలిపారు. గంజాయి పట్టుకున్న వారిలో అదనపు ఎస్.ఐ సర్కార్, హెడ్ కానిస్టేబుల్ తుకారాం,సిబ్బంది భాస్కర్, రమేష్,చంద్రమౌళి తదితరులు ఉన్నారు.



## కొత్త రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభం

**టీ మీడియా, జనవరి 12, రామకృష్ణాపూర్ :**

క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లో ని 17వ వార్డు, బి జోన్ సెంటర్, శ్రీనివాస్ నగర్ రోడ్డు నిర్మాణానికి మున్సిపాలిటీ జనరల్ ఫండ్ నుండి రెండు లక్షల రూపాయల వ్యయంతో శుక్రవారం వార్డు కౌన్సిలర్ రామిడి ఉమాదేవి కుమార్ లు కొబ్బరికాయ కొట్టి రోడ్డు పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పొలం సత్తన్న, వ్యాపారస్తులు పాల్గొన్నారు.



## పలు కుటుంబాలు పరామర్శించిన దుద్దిల్ల శ్రీను బాబు

**టీ మీడియా, జనవరి 12, మంథని :**

మహదేవ్ పూర్ బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షుడు కోట రాజ బాపు తల్లి కోట లక్ష్మి ప్రథమ వర్థంతి సందర్భంగా కార్యక్రమానికి హాజరై వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన దుద్దిల్ల శ్రీను బాబు మహాదేవపూర్ మండల కేంద్రంలోని సూరారం గ్రామంలో గోడిసెల మనిష్ అనారోగ్యంతో బాదపడుతుండగ వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నా శ్రీ దుద్దిల్ల శ్రీను బాబు సూరారం గ్రామంలో నల్లమాసుల గోపి, తుల రామకృష్ణయ్య గార్లు మృతిచెందాగా వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపిన శ్రీను బాబు.



## మిర్చి మార్కెట్‌ను తనిఖీ చేసిన మంత్రి తుమ్మల

- అధికారులపై ఆగ్రహం

**టి మీడియా, జనవరి 12, ఖమ్మం బ్యూరో :**
రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం మిర్చి మార్కెట్‌ను సందర్శించారు. తేమశాతం పేరిట వ్యాపారులు ఇబ్బంది పెడుతున్నారనే సమాచారంతో ఆయన మార్కెట్‌లో రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషన్ వ్యాపారులు తేమ శాతంతో ఉన్న రేటును తగ్గిండం సరికాదంటూ సూచించారు. వాస్తవ ధర రైతులకు వర్తింపజేయాలని అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. క్వాలిటీ ఉన్న మిర్చి కూడా తక్కువ ధరకు కొనడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేసారు. మిర్చి ధర తగ్గడంపై మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ని ఖమ్మం రావాలని ఆదేశించారు. రైతులు మోస పోకుండా ఇతర శాఖలను సమన్వయం చేసుకొని రైతుకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.



## నూతన గదుల నిర్మాణానికి త్వరలో భూమిపూజ

**టీ మీడియా, జనవరి 12, మహానంది :**
మహానంది దేవస్థానంలో భక్తులకోసం నిర్మించనున్న నూతన గదుల నిర్మాణానికి త్వరలో భూమిపూజ నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులు విడిది చేసేందుకు తగినన్ని గదులు లేవని అన్నారు. త్వరలో 55 గదులను నిర్మించడం జరుగుతుందన్నారు.గదుల నిర్మాణానికి అవసరమైన ప్రాంతాన్ని పరిశీలించి వర్కర్ల చేత శుభ్రం చేయించారు. ఆయన వెంట ఏ ఈఓ మధు, నాగ మల్లయ్య, తదితరులు ఉన్నారు.



## దహనం కేసు,మల్లేపల్లికి చెందిన యువతిగా గుర్తింపు

**టీ మీడియా , జనవరి 12,హైదరాబాద్ :**
హైదరాబాద్ నగర శివారు మొయినాబాద్‌లో యువతి దహనం కేసులో పురోగతి లభించింది. మృతురాలిని మల్లేపల్లికి చెందిన యువతిగా పోలీసులు గుర్తించారు. తమ కుమార్తె కనిపించట్లేదని తల్లిదండ్రులు ఠాణాలో ఫిర్యాదు చేయడంతో వివరాలు బయటపడ్డాయి. ఇంటి నుంచి ఒంటరిగా బయలుదేరిన యువతిని మొయినాబాద్‌కు ఎవరు తీసుకొచ్చారనే కోణంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. యువతిని వేరే చోట హత్యచేసిన నిందితులు ఇక్కడికి తీసుకొచ్చి నిప్పంటించినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని బైకుపై తీసుకొచ్చి ఉంటారని భావిస్తున్నారు. ఘటన జరిగిన చోట కారు ప్రయాణించిన ఆనవాళ్లు కనిపించలేదు. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహనంపై మృతదేహాన్ని తీసుకొచ్చి ఉంటారని.. వచ్చి, పారిపోయేందుకు వేర్వేరు మార్గాలను ఉపయోగించినట్లు అనుమానిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు మొత్తం ఏడు బృందాలు పనిచేస్తున్నాయి.



## గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఘనంగా ముందస్తు సంక్రాంతి ముగ్గుల పోటిలు

**టీ మీడియా, జనవరి 12, పెద్దపల్లి :**
పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని, స్థానిక గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులు ముగ్గులు వేసి వివిధ రకాల రంగులతో, పుష్పాలతో, గొబ్బెమ్మలు, రేగు పండ్లతో, నవధాన్యాలతో, హరిదాసులు, గంగిరెద్దుల బొమ్మలతో మన సంస్కృతి సంప్రదాయాలు ఆచార వ్యవహారాలు ప్రతిబింబించేలా ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సమైక్య సేవా సమితి మెంబర్ నాగలక్ష్మి మేడం హాజరై మాట్లాడుతూ సంక్రాంతి పండుగ యొక్క విశిష్టతను తెలియజేయడం జరిగింది. గెలుపొందిన తృతీయ సంవత్సరం విద్యార్థులు అయిన శరణ్య అండ్ గ్రూప్ ప్రథమ బహుమతి, ప్రత్యూష అండ్ గ్రూప్ ద్వితీయ బహుమతి, మానస అండ్ గ్రూప్ తృతీయ బహుమతులు గెలుపొందారు. ప్రోత్సాహక బహుమతులు స్నేహ అండ్ గ్రూప్, సింధుఅండ్ గ్రూప్ కు బహుమతులు ప్రధాన ఉత్సవం చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా కళాశాల కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్.సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జే.రవీందర్,లెక్చరర్స్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## బిల్లుకట్టనిదే ....
# డెడ్ బాడీ ఇవ్వం

- ప్రూ డేన్స్ హాస్పిటల్ దారుణం
- ఎవరికి చెప్తారో చెప్పుకోండి.. చూసుకుంటాం
- ప్రయివేట్ ఆస్పత్రిలో నిర్వాకం

**టీ మీడియా, జనవరి 12,నిజామాబాద్ :**
జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులు రోజురోజుకు రెచ్చిపోతున్నాయి . ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఏ పార్టీ ఉంటే ఆ పార్టీకి వత్తాసు పలుకుతూ తమ కార్యకలాపాలను నడిపించుకుంటూ మీరు ఏం చేస్తారో చేసుకోండి అంటూ నిజామాబాద్ లోని సంబంధిత వైద్యశాఖ అధికారులకు చెబుతున్నారు. డబ్బుల కోసం ఎంతటి దారుణానికైనా పాల్పడుతున్నారు నిజామాబాద్ ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యాలు. రెగ్యులర్ డాక్టర్లు లేకున్నా ఆన్ కాల్ పై డాక్టర్లను రప్పించే కొన్ని ఆసుపత్రులు కార్పొరేట్ స్థాయి వైద్యం పేరుతో రోగులను దోచేస్తున్నాయి. తీరా వైద్యం చేసి ఫీజులు కట్టకపోతే వారి వేధింపులు అంతా ఇంతా కావు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన వ్యక్తి మృతదేహాన్ని అప్పగించేందుకు పెండింగ్ బిల్లును ఇస్తే గాని డెడ్ బాడీ ఇవ్వమని పేచిపెట్టిన సంఘటన శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగింది. దానితో మృతుని కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. గత నెల ఐదున నిజామాబాద్ జిల్లాలోని పోతంగల్ రోడ్డు ప్రమాదానికి గురైన సిద్ది నయూమ్ నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రి అయిన ప్రూడేన్స్ హాస్పిటల్ లో బంధువులు చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. అయితే నయుం తలకు తీవ్ర గాయాలు అవ్వడంతో ఆస్పత్రి సిబ్బంది వైద్యులు ఆపరేషన్ చేయాల్సిందిగా బంధువులకు సూచించడంతో చేయాల్సిందిగా బంధువులు తెలపడంతో వైద్యులు ఆపరేషన్ చేశారు. అయితే మొన్నటి వరకు ఆపరేషన్ విజయవంతంగా జరిగిందని డాక్టర్లు బుకాయింపుకు పాల్పడడం జరిగిందని, గురువారం నుండి నయుంను చూపించడానికి వైద్యులు నిరాకరించారు అని తెలిపారు. అనుమానం వచ్చిన తమకు నయుంను చూపించాల్సిందిగా డాక్టర్లను బలవంతం పెట్టడంతో నయుం మృతి చెందారని, రూ. 2 లక్షల చిల్లర బిల్లు కట్టాలని, కట్టకపోతే మృతదేహం బాధితులకు అందివ్వమని ఆస్పత్రి యాజమాన్యం తెలపడంతో మృతుని బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ఆ తర్వాత ఆందోళన తీవ్ర రూపం దాల్చడంతో, ఆస్పత్రి యాజమాన్యం వెనక్కు వచ్చి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. డబ్బుల కోసం ఎంత నీచానికైనా పాల్పడతారని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫోన్ చేయగా ఎవరు కూడా ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు. సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని నిజామాబాద్ జిల్లా ప్రజలు అడుగుతున్నారు.




## స్విట్జర్లాండ్‌తో సమానంగా భారతీయ రైల్వే నెట్‌వర్క్

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**టీ మీడియా , జనవరి 12, హైదరాబాద్:**
స్విట్జర్లాండ్‌తో సమానంగా భారతీయ రైల్వే నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేశామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 53 శాతం రాయితీతో భారతీయ రైల్వే సేవలు అందిస్తున్నదని చెప్పారు. రోజుకు 16 కిలోమీటర్ల రైల్వే నెట్‌వర్క్ పెరుగుతున్నదని తెలిపారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లను మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో రైల్వే బడ్జెట్ రూ.8 వేల కోట్ల నుంచి రూ.29 వేల కోట్లకు పెరిగిందన్నారు. అయితే మోదీ ప్రభుత్వంలో అది రూ.2.8 లక్షల కోట్లకు చేరిందని తెలిపారు. దక్షిణమధ్య రైల్వే మరో మూడు రైళ్లను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. హుబ్బల్లి-నర్సాపూర్, విశాఖపట్నం-గుంటూరు, నంద్యాల-రేణిగుంట ఎక్స్‌ప్రెస్ రైళ్లను మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించారు.

## ఎన్నికలకు ముందు హడావిడిగా ఆలయాన్ని ప్రారంభిస్తున్నారు

- కాంగ్రెస్ నేత పవన్ ఖేరా




**టీ మీడియా, జనవరి 12, న్యూఢిల్లీ :**
అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రారంభోత్సవ వేడుకలపై కాంగ్రెస్ నేత పవన్ ఖేరా స్పందించారు. దేశంలో ప్రముఖమైన నాలుగు శంకరాచార్య పీఠాల సూచనలతోనే ఈ కార్యక్రమం జరుగుతుందా అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్టకు కొన్ని సంప్రదాయాలు, క్రతువులు ఉంటాయని, ఇది మతపరమైన కార్యక్రమం కావడంతో అసలు నలుగురు శంకారాచార్యుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతున్నదా అని పవన్ ఖేరా ప్రశ్నించారు. అసంపూర్తిగా ఉన్న ఆలయానికి ప్రాణ ప్రతిష్ట చేయరాదని నలుగురు శంకరాచార్యులు చెబుతున్నారని అన్నారు. భక్తుడికి, దేవుడికి మధ్య దళారీగా రాజకీయ నాయకులు కూర్చోవడం తగదని, ఇది రాజకీయ కార్యక్రమం కాదని పవన్ ఖేరా స్పష్టం చేశారు. రామాలయ ప్రారంభోత్సవానికి ఏ పంచాంగం ప్రకారం బీజేపీ తేదీని ఖరారు చేసిందని ఆయన నిలదీశారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే జనవరి 22న ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని చేపట్టారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు అయోధ్య రామాలయాన్ని ప్రారంభిస్తున్నారని అంతకుముందు సీనియర్ కాంగ్రెస్ నేత టీఎస్ సింగ్‌దేవ్ విమర్శించారు. ఈ కార్యక్రమాన్ని రాజకీయ వేదికగా మార్చారని ఆయన మండిపడ్డారు. సార్వత్రిక ఎన్నికలు రానుండటంతోనే ఆలయం పూర్తికాకుండానే ప్రారంభిస్తున్నారని ఛత్తీస్‌ఘఢ్ మాజీ సీఎం కూడా అయిన సింగ్‌దేవ్ ఆరోపించారు.

## పదోన్నతి ద్వారా మరింత బాధ్యత పెరుగుతుంది


- పోలీస్ కమీషనర్ రెమా రాజేశ్వరి ఐపిఎస్



**టీ మీడియా, జనవరి 12, గోదావరిఖని :**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి లో ఏఎస్ఐ గా పనిచేస్తూ ఎస్ఐ గా పదోన్నతి పొందిన 08 మంది, హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తు ఏఎస్ఐ గా పదోన్నతి పొందిన 10 మంది,కానిస్టేబుల్ గా పని చేస్తూ హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతులు పొందిన 19 మంది సిబ్బందిని రామగుండం పోలీస్ కమీషనర్ రెమా రాజేశ్వరి ఐపిఎస్.(డిఐజి) వారి కార్యాలయంలో శుక్రవారం అభినందించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని, పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని,గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలని సీపీ అన్నారు.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పనిచేసి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, కష్టపడి పని చేస్తే ఎప్పటికైనా మంచి గుర్తింపు లభిస్తుందని, ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉంటాం, మానసికంగా శారీరకంగా ఒత్తిడిని దూరం చేయడానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని, మనం ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు అని ఈ సందర్భంగా సీపీ గారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లాకుంట పోచలింగం పాల్గొన్నారు.

## టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్, సభ్యుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల

**టీ మీడియా, జనవరి 12,హైదరాబాద్:**
తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) లో ఖాళీగా ఉన్న చైర్మన్, సభ్యుల నియామకానికి ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. అర్హులైన వారు ఈ నెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు నోటిఫికేషన్‌ను జారీ చేసింది. www.telangana. gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు నమూనా పత్రాలను ఉంచినట్లు తెలిపింది. చైర్మన్, సభ్యుల పదవులకు కావాల్సిన అర్హతలు, మరిన్ని వివరాలు వెబ్‌సైట్‌లో చూడాలని పేర్కొంది.దరఖాస్తులను ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పంపాలని స్పష్టం చేసింది. ఇటీవల గవర్నర్ తమిళి సై టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ బి.జనార్దన్‌రెడ్డి, సభ్యులు సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి, లింగారెడ్డిల రాజీనామాలను ఆమోదించిన నేపథ్యంలో తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది.పశ్నాపత్రాల లీకేజీ అయిన నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ సభ్యులపై నిరుద్యోగుల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. కమిషన్ ఛైర్మన్‌ను తొలగించడంతో పాటు బోర్డు మొత్తాన్ని ప్రక్షాళన చేయాలని నిరుద్యోగులతో పాటు పలు రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి.కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిసెంబర్ 11న జనార్దన్ రెడ్డి కలిసి రాజీనామా చేశారు. ఆ తరువాత మరో ముగ్గురు కమిషన్ సభ్యులు రాజీనామాలు సమర్పించారు. వీరి రాజీనామాలను గవర్నర్ జనవరి 10న ఆమోదించిన సంగతి తెలిసిందే.






## హైదరాబాద్-విజయవాడ రహదారిపై ట్రాఫిక్ జామ్..

**టీ మీడియా , జనవరి 12,హైదరాబాద్ :**
ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత ఘనంగా జరుపుకునే సంకాంత్రి పండుగను కుటుంబ సభ్యులతో జరుపుకొనేందుకు వెళ్తున్న వారితో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి కిక్కిరిసిపోయింది. వందలాది వాహనాలు ఒకేసారి రోడ్డెక్కడంతో ట్రాఫిక్ నత్తనడకన సాగుతోంది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర బారులుతీరాయి. అయితే, 95శాతం వాహనాలకు ఫాస్టాగ్ పూర్తికావడంతో టోల్‌ప్లాజా వద్ద వాహనాల కదలికలో వేగం పుంజుకుంది. మరోవైపు, ట్రాఫిక్‌ను వీలైనంత వేగంగా క్లియర్ చేసేందుకు టోల్‌ప్లాజాలోని 10 గేట్లను ఎత్తారు. సాధారణ రోజుల్లో ఈ టోల్‌ప్లాజా మీదుగా రోజుకు 30 వేల వరకు వెళ్లే వాహనాల సంఖ్య సంక్రాంతి రోజుల్లో 60 నుంచి 70 వేల వరకు వాహనాలు వెళ్తాయని టోల్‌ప్లాజా అధికారులు తెలిపారు. ఏపీ వాసులు నగరాన్ని వీడుతుండడంతో హైదరాబాద్ రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. నగరంలో ట్రాఫిక్ జామ్‌లు కనిపించడం లేదు. ప్రతి కూడలిలో వాహనాలు సాఫీగా సాగిపోతున్నాయి

## భట్టిని కలిసిన షర్మిల...నా కొడుకు పెళ్ళికి రండి



**టీ మీడియా, జనవరి 12,హైదరాబాద్:**
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కని ప్రజాభవన్ వైఎస్ షర్మిల కలిశారు. కుమారుడి పెండ్లీ కార్డును అందజేశారు. భట్టి అన్నా బాగున్నారా కంగ్రాట్యులేషన్ మీరు డిప్యూటీ సీఎం కావడం నాకు వెరీ వెరీ హ్యాపీగా ఉందని ఈ సందర్భంగా షర్మిల తెలిపారు.భట్టి అన్న నా కొడుకు పెళ్ళికి రండి అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకి వివాహ పత్రికను అందజేశారు. ఈ నెల 18న నా తనయుడు రాజారెడ్డి, ప్రియల నిశ్చితార్థం, ఫిబ్రవరి 17వ తేదిన జరిగే పెండ్లికి రావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఆహ్వానించారు షర్మిల. అనంతరం ఇరువురు కాసేపు కూర్చొని మాట్లాడుకున్నారు.

## కాటన్ మిల్లులో భారీ అగ్నిప్రమాదం



**టీ మీడియా, జనవరి 12,అదిలాబాద్:**
కొమురం భీం జిల్లా రెబ్బెన మండలం కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ వద్ద గల కాగజ్ నగర్ కాటన్ మిల్లులో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో మిల్లులో ప్రమాదవశాత్తు పత్తికి నిప్పు అంటుకుంది. వెంటనే సిబ్బంది అప్రమత్తమై అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. మిల్లులో ఉన్న 125 పత్తి బేళ్లు, 2500 వందల క్వింటాళ్ల పత్తి కాలిపోయింది. దాదాపు రెండు కోట్ల విలువగల పత్తి పూర్తిగా కాలిపోయినట్లు సమాచారం పత్తి మిల్లు వద్దకు పోలీసులు చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

## ప్రతి జిల్లా కేంద్రంలో స్కిల్ యూనివర్సిటీలు

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**టీ మీడియా, జనవరి 12,హైదరాబాద్:**
తెలంగాణ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడానికి ప్రతి జిల్లాలో స్కిల్ సెంటర్లు, స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నా మని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు.నైపుణ్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. ప్రభుత్వ రంగంలో 2 లక్షల ఉద్యోగాల భర్తీకి కూడా చర్యలు చేపడుతున్నా మని, ప్రైవేటు రంగంలోనూ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాల కల్పనకు చర్యలను ముమ్మరం చేస్తున్నామని వివరించారు.జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద జయంతి సందర్భంగా రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల మంత్రి డి శ్రీధర్ బాబు శుక్రవారం వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.సికింద్రాబాద్ లోని డైరెక్టర్ అండ్ కమిషనర్ యూత్ సర్వీసెస్ కార్యాలయం లో యువజన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన జాబ్ మేళని మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. సెట్విన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో ప్రిన్సిపల్ కార్యదర్శి సవ్యసాచి ఘోష్, సెట్విన్ ఎండీ వేణుగోపాల్ పాల్గొన్నారు.5 వేల ఉద్యోగాల కల్పనకు నిర్వహించిన జాబ్ మేళాలో 80 కంపెనీలు పాల్గొనగా%ా% 6500 మంది యువత రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.